


రిజిస్ట్రేషన్లు ఎప్పుడు?

- సంగెం, గీసుగొండ మండలాల కొన్ని గ్రామాతోనే సరిపుచ్చుతున్న వైనం
- నిత్యం పదుల సంఖ్యలో కూడా రాని డాక్యుమెంట్లు
- వెలవెలబోతున్న వరంగల్ కార్యాలయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పూర్తి పర్మిషన్లు ఇవ్వాలంటున్న ప్రజలు

వరంగల్ పరిధి రిజిస్ట్రేషన్లు హనుమకొండలో..

పోచమ్మమైదాన్, జనవరి 9: వరంగల్ నగరం పోచమ్మమైదాన్‌లో సొంత భవనంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు లేక వెలవెలబోతోంది. నగరం నడిబొడ్డున ఉన్నా దస్తావేజులు లేక సాయంత్రం లోపే తాళాలు పడుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్నా రిజిస్ట్రేషన్లకు చాన్స్ లేకుండా పోయింది. వరంగల్ జిల్లా పరిధిలోని ప్రధాన ప్రాంతాల రిజిస్ట్రేషన్లు సైతం హనుమకొండ జిల్లాలోని కార్యాలయంలో చేయడంతో ఇక్కడి కార్యాలయాలు నామమాత్రంగా మిగిలాయి. సంగెం, గీసుగొండ మండలాల్లోని కొన్ని గ్రామాలవి మాత్రమే ఇక్కడ రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో వెలవెలబోతోంది. జిల్లాల పునర్విభజన జరిగి సంవత్సరాలు గడుస్తున్నా, పక్క జిల్లాలోనే రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులో భాగంగా 'ఎనీ వేర్ రిజిస్ట్రేషన్' తీసేసి జురీస్ డిక్షన్ (మా పరిధి) అమలు చేశారు. దీంతో జిల్లాలోని హన్మకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సుమారుగా 80శాతం జురీస్ డిక్షన్ వచ్చింది. తర్వాత వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలుగా రూపాంతరం చెందినా... తదుపరి వరంగల్, హన్మకొండ జిల్లాలుగా మారినా వరంగల్ కార్యాలయానికి మాత్రం వరంగల్ మండల పరిధిలోని ప్రాంతాల రిజిస్ట్రేషన్ సేవలు కేటాయించడం లేదు. దీంతో వరంగల్ పోచమ్మమైదాన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కళతప్పింది.

కొన్ని గ్రామాలవే రిజిస్ట్రేషన్లు..

గ్రేటర్ నగరంలో పోచమ్మమైదాన్‌లోని వరంగల్ (రూరల్) రిజిస్ట్రేషన్ కార్యాలయం దస్తావేజులు లేక వెలవెలబోతుంది. గతంలో వరంగల్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో సంగెం, గీసుగొండ, హసన్‌పర్తి, ఆత్మకూరు, హన్మకొండ మండలాలు ఉండేవి. ఈ మండలాలకు సంబంధించిన సుమారు 50కి పైగా గ్రామాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం వరంగల్ (రూరల్) కార్యాలయం పరిధిలో సంగెం మండలం కొంత భాగం, గీసుగొండ మండలం కొంత భాగం మాత్రమే ఉన్నాయి. అలాగే ఖిలావరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఐనవోలు, ఖిలావరంగల్, మట్టెవాడ శివారు, నగరానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు అధికంగా జరిగేవి. ప్రస్తుతం ఐనవోలు, ఖిలావరంగల్ మండలాలు మాత్రమే ఉన్నాయి. దీంతో తగినన్ని రిజిస్ట్రేషన్లు లేక కార్యాలయాలు బోసిపోతున్నాయి.

పదుల సంఖ్యలోనే దస్తావేజులు..

వరంగల్ (రూరల్) రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్‌లు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో వరంగల్ కార్యాలయంలో ప్రతీ రోజు సుమారు వందకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం ఐదు నుంచి పది దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీంతో గతంలో రాత్రి 8 గంటల వరకు జనాలతో కళకళలాడే ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రస్తుతం డాక్యుమెంట్లు లేక సాయంత్రం 5 గంటలలోపే తాళాలు పడుతున్నాయి. వరంగల్ మండలం పరిధిలోని అన్ని ప్రాంతాల రిజిస్ట్రేషన్‌లు హన్మకొండ జిల్లాలోని కార్యాలయంలో జరుగుతుండటంతో అక్కడ ప్రతి రోజు వందల సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయి. దీంతో వరంగల్ జిల్లాకు రావాల్సిన ఆదాయం సైతం చేజారిపోతుంది.

అధికారులు విఫలం..

జిల్లాల విభజన జరిగి సంవత్సరాలు గడుస్తున్నా వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్లను కేటాయించడంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం హన్మకొండ కార్యాలయంలో వరంగల్ మండలానికి సంబంధించిన పూర్తి రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. దీనివల్లే వరంగల్ కార్యాలయంలో దస్తావేజులు రావడం లేదు. వరంగల్ మండల పరిధిలో పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట, మట్టెవాడ శివారు, ఏనుమాముల, లక్ష్మీపురం, దేశాయి పేట శివారు ప్రాంతాల రిజిస్ట్రేషన్ల అనుమతి వరంగల్ కార్యాలయానికి కేటాయించాల్సి ఉంది. ఇలా చేస్తే వరంగల్ కార్యాలయంలో నిత్యం సుమారు వంద డాక్యుమెంట్ల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. వరంగల్ మండల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వరంగల్ కార్యాలయానికి కేటాయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతి నిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈసీ, సర్టిఫైడ్ కాపీలకూ ఇబ్బందే..

కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల కంటే ఎక్కువగా ప్రజలు ఈసీ, సర్టిఫైడ్ కాపీల కోసం వస్తుంటారు. వరంగల్ మండల పరిధి పూర్తిగా హన్మకొండలో కొనసాగుతుండడంతో వరంగల్ (రూరల్) పరిధిలో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకున్నా, కొన్నిసార్లు కార్యాలయం నుంచి ఈసీలు, సర్టిఫైడ్ కాపీలు తీసుకోవడం తప్పనిసరి అవుతోంది. దీంతో హన్మకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అసలే హన్మకొండలో రద్దీ పెరగడంతో ఈసీ, సర్టిఫైడ్ కాపీల కోసం వెళ్లిన వారు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తలెత్తిందని బాధితులు చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలి

- న్యాతని గోపాల్, వరంగల్ డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్లు హన్మకొండకు వెళ్లి చేసుకోవాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ మండల పరిధిలోని పూర్తి ప్రాంతాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని కార్యాలయంలో చేసుకునేందుకు ఉన్నతాధికారులు అనుమతులు జారీ చేయాలి. దస్తావేజులు లేక వరంగల్ డాక్యుమెంట్స్ రైటర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రజా ప్రతినిధులు చొరవ చూపి వరంగల్ జిల్లాలోని రిజిస్ట్రేషన్లు జిల్లా పరిధిలోనే జరిగేలా చూడాలి. వెంటనే వరంగల్ మండల పరిధిలోని రిజిస్ట్రేషన్లు వరంగల్ కార్యాలయానికి కేటాయించే విధంగా కృషి చేయాలి.



సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వాన పత్రికతోపాటు మల్లన్న స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మంతి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

ఐలోని మల్లన్న జాతరకు రండి..

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి కొండాసురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- ఆహ్వాన పత్రిక అందజేత

ఐనవోలు, జనవరి 9: లక్షలాది మంది భక్తులు కొలిచే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరా మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసి జాతర ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 14, 15 తేదీలలో జరిగే మహాజాతర తీరును వివరిస్తూ జాతరకు రావాలని కోరుతూ ఆలయ అర్చకులు కోరుతూ స్వామి వారి చిత్రపటం, ప్రసాదంతోపాటు వేద ఆశీర్వచనం అందజేశారు.

కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో కింద టేడు ఫిబ్రవరి 16న 'హాత్‌సే హాత్ జోడో' పాదయాత్రలో భాగంగా ఐనవోలు ఆలయ సమీపంలో విడిదిచేశారు. మరుసటి రోజు స్వామి వారిని దర్శించుకొని పాదయాత్రను ప్రారంభించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగరాజుతోపాటు అర్చకులు సీఎంకు గుర్తుచేయగా సంతోషించారు. ఆహ్వానంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేదపండితులు పురుషోత్తంశర్మ, విక్రాంత్‌జోషి, అర్చకుడు నరేష్‌శర్మ, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, పింగిళి వెంకట్ రెడ్డి, గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, ఆలయ అధికారులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వరంగల్ రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్

'పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి'

వర్ధన్నపేట, జనవరి 9: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని ప్రజాపాలన ప్రత్యేక అధికారి, వరంగల్ రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ అన్నారు. వర్ధన్నపేట పురపాలక సంఘం నుంచి అందిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. కాగా ఆ సెంటర్‌ను వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ జోనాతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. దరఖాస్తులను ఎలాంటి తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

విద్యార్థులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు

- డీఎంహెచ్‌వో వెంకటరమణ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి మందులు ఉచితంగా అందజేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతితో కలిసి అనీమియా ముక్త్ భారత్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమాన్ని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. పిల్లల ఆరోగ్య తీవ్రతను బట్టి ఆస్పత్రులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఇవే కాకుండా నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రతీ సంవత్సరం పిల్లలకు రెండుసార్లు ఆల్బెండాజోల్ మాత్రలను వేయించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాల ద్వారా రక్తహీనత నిర్మూలన కొరకు వీక్లీ ఐరన్ పోలిక్ టాబ్లెట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

డీఈవో వాసంతి మాట్లాడుతూ విద్య, వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంతో కార్యక్రమాల్లో పాలు పంచుకొని వైద్య ఆరోగ్య సిబ్బందికి తోడ్పాటు అందించాలని చెప్పారు. పిల్లలకు నిర్వహించే పరీక్షల్లో విద్యా శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన సామాజిక సేవా శిఖరం

- గుండెపోటుతో రామా శ్రీనివాస్ కన్నుమూత
- మోక్షారామం ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు
- హైదరాబాద్‌లో నివాళులర్పించిన కేటీఆర్, హరీష్‌రావు
- విషాదంలో ఓరుగల్లు... నేడు అంత్యక్రియలు



రామా శ్రీనివాస్ (ఫైల్)



హైదరాబాద్‌లో శ్రీనివాస్ భౌతిక దేహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీష్‌రావు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: సామాజిక సేవా శిఖరం నేలకొరిగింది. పిలిచిన వెంటనే తానున్నానంటూ ఎందరికో అండగా నిలిచిన మానవతా మూర్తి కన్నుమూశారు. సామాజికసేవను జీవితంలో ఒక భాగంగా మలుచుకున్న ఆదర్శనీయుడు కనుమరుగైపోయారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక సేవకుడు రామా శ్రీనివాస్(59) హైదరాబాద్‌లో మంగళవారం గుండెపోటుతో కన్నుమూయడంతో ఓరుగల్లు విషాదంలో మునిగిపోయింది. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందారు.

వరంగల్ రామన్నపేటలో జన్మించిన శ్రీనివాస్‌కు భార్య శోభారాణి, కుమారుడు శైలేష్, కూతురు స్వాతి ఉన్నారు. నలుగురు సోదరులు, సోదరి ఉన్నారు. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ పేద ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ అభివృద్ధికి పాటుపడ్డారు. 2016 నుంచి సేవా కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చుచేశారు. రామన్నపేటలో మోక్షారామం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలతో శ్మశాన వాటికను అభివృద్ధి పర్చి అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇల్లులేని వారు కుటుంబ సభ్యులు ఎవరైనా అకాల మృతి చెందితే వారి దహన సంస్కారాలు, కర్మకాండలు పూర్తయ్యే వరకు ఉచితంగా ఉండటం కోసం శ్మశాన వాటికలో నాలుగు గదులు నిర్మించారు. వృద్ధులు, ఒంటరి వారు, దివ్యాంగుల కోసం అమ్మఒడి భవనంలో నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలు, బొడ్డెమ్మ, బతుకమ్మ, దసరా, సంక్రాంతి ముగ్గులు కార్యక్రమాలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేసే వారు. నిరుపేద ఆడపిల్లల కుటుంబాలకు వివాహానికి బంగారు పుస్తే, మట్టెలు, బట్టలు, నగదు సహాయం చేసేవారు.

కరోనా సమయంలో ప్రతీరోజు ఆస్పత్రులకు , పోలీసు సిబ్బందికి వేయి మందికి ఆహారం అందించారు. నగర ప్రజలు ప్లాస్టిక్ వాడొద్దని బట్ట సంచులు కుట్టించి ఇంటింటికీ వితరణ చేశారు. చెత్త కోసం ఉపయోగించడానికి ప్రతీ ఇంటికి రెండు డస్ట్ బిన్‌లు ఇచ్చారు. నగరంలో చెత్త తీసుకెళ్లడానికి దాదాపు రూ. కోటితో 420 రిక్షాలను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయానికి అందజేశారు. ఆలయాలకు, స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందజేశారు. రామన్నపేట ప్రజల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి కేవలం నాలుగు రూపాయలకే 20 లీటర్ల మంచినీరు అందిస్తున్నారు.

నగరంలో విషాదచాయలు..

రామా శ్రీనివాస్ ఇక లేరనే వార్త తెలిసి వరంగల్ వాసులు, మోక్షారామం, అమ్మ ఒడి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. పద్మశాలీ కుల బాంధవులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కేటీఆర్, హరీష్ రావు నివాళి..

శ్రీనివాస్ అకాల మృతి విషయం తెలియగానే టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హుటాహుటిన హైదరాబాద్ సోమాజిగూడలోని శ్రీనివాస్ నివాసానికి వచ్చి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితోపాటు పలువురు ప్రముఖులు, అధికారులు శ్రీనివాస్ భౌతిక దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి వరంగల్ నగరానికి శ్రీనివాస్ భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. బుధవారం ఉదయం రామన్నపేటలోని మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖులతో సంబంధాలు

పారిశ్రామికవేత్తగా, సేవాతత్పరుడిగా ఉన్న శ్రీనివాస్ దేశంలో, రాష్ట్రంలో పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కేసీఆర్‌తో పాటు దివంగత మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతోపాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పద్మశాలీ ప్రముఖులకు సుపరిచితుడిగా ఉన్నారు.

ఐటీసీ చేతికి బిల్ట్!

- పేపర్ మిల్లు, ఆహార ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు అవకాశం
- కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు
- అందుబాటులో 750 ఎకరాల భూములు
- మంత్రి సీతక్క చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు

7



పది జోన్లుగా మేడారం

- పని విభజన చేసి సౌకర్యాలు కల్పించాలి
- 31లోగా మహాజాతర ఏర్పాట్లు పూర్తికావాలి
- రూ.30 కోట్ల విడుదలకు గ్రీన్‌సిగ్నల్
- భక్తుల కోసం 6 వేల ఆర్టీసీ బస్సులు
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రుల సమీక్ష
- పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, పోలీసు, ఇతర శాఖల అధికారులు



మేడారం సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

ములుగు, జనవరి 9: ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతంగా జరిపించాలని, మొత్తం పది జోన్లుగా పనులను విభజించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. రూ.75 కోట్ల నిధులతో మొదలుపెట్టిన పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. పోలీసు, రెవెన్యూ, అటవి, రోడ్డు భవనాలు, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతోపాటు హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు, ఎస్పీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగులోని నీరు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. తాగునీటి వసతిని మెరుగుపర్చాలని, క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది జరగకుండా చూడాలని అన్నారు. రూ.75 కోట్లకు అదనంగా మరో రూ.30 కోట్ల కోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించి వెంటనే నిధులను విడుదల చేస్తామని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేస్తేనే జాతర సక్సెస్ అవుతుందని అన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళా భక్తుల రద్దీ పెరిగే

మిగతా 8వ పేజీలో..

2 రోజుల పాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, జనవరి 9: రైల్వే మూడోలైన్ నిర్మాణాల పనుల దృష్ట్యా బుధవారం, గురువారం రెండు రోజులపాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైల్వే గేటు ద్వారా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని తెలిపారు. శుక్రవారం నుంచి యథావిధిగా ఈ గేటు తెరిచి ఉంటుందని చెప్పారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫీజు గడువు 22

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలఫీజులు జనవరి 22 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధి కారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జనవరి 24వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ ఫీజుల చెల్లించుకోవాలన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 5గురు డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 9: కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎం.తిరుమలదేవి తెలిపారు. డీబారైన వారిలో ఉమ్మడి ఖమ్మంలో -2, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 మంది డీబారైనట్లు తెలిపారు. వీరిపై చర్యలుంటాయని తెలిపారు.

నూతన పెన్షన్ విధానాన్ని
రద్దు చేయకుంటే సమ్మె చేస్తాం..
మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్


మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాస్

కాజీపేట, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయకుంటే సమ్మె చేయడానికైనా సిద్ధమని దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ లోకో బ్రాంచ్ ఛైర్మన్ పాక వేదప్రకాశ్ ఆధ్వర్యంలో డీజిల్ షెడ్ వద్ద రెండో రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను కాల్వ శ్రీనివాస్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. రైల్వే కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని కార్మికులు వారి కుటుంబాలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికుల పక్షాన ఉన్న పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతిస్తామన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో బ్రాంచ్ నాయకులు ఎస్.కె. జానీ, తిరుపతి, ప్రదీప్‌రాయ్, యాదగిరి, పి.రవి కిరణ్, నరేష్ యాదవ్, మాషుక్ జానీ, ఎ.సదానందం, జి.నాగరాజు ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న పోలీసు అధికారులు
అభినందించిన సీపీ అంబర్ కిశోర్ ఝా


పోలీసు క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ

హనుమకొండ క్రైం, జనవరి 9: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వరంగల్ ఎస్‌బీ ఏసీపీ మూల జితేందర్‌రెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ కె.సంజీవ్‌లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. మంగళవారం సీపీ కార్యాలయానికి పిలి పించి ఇద్దరు అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ నెల 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో సత్తాచాటారు. 55 యేళ్ల విభాగంలో జితేందర్‌రెడ్డి సింగిల్స్, మిక్స్ డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, 60 యేళ్ల విభాగంలో సంజీవ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరిని జాతీయస్థాయి పోలీసు క్రీడలకు ఎంపిక చేసినట్టు నిర్వాకులు తెలిపారు. సత్తాచాటి పతకాలు సాధించిన క్రీడాకారులను వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కాళోజీ జంక్షన్, జనవరి 9: దేశ వ్యాప్తంగా ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని కోరుతూ హనుమకొండ రాంనగర్‌లోని వరంగల్ గ్రామీణ వికాస బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట బ్యాంకు ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కారింగ్ భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ వికాస బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వాటి పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తెచ్చేందుకు ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకులో 20 యేళ్లుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న సుమారు 700మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని గ్రామీణ వికాస బ్యాంకులను స్పాన్సర్ బ్యాంకుల నుంచి విడదీయాలని, మ్యాన్ పవర్ పాలసీ ప్రకారంగా ప్రమోషన్లు, నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాక వాణిజ్య బ్యాంకుల మాదిరిగా ఉద్యోగులకు గ్రాట్యుటీ బేసిక్‌పే, డీఏ కలిపి చెల్లించాలని అన్నారు. ధర్నా అనంతరం ఉద్యోగ సంఘం నాయకులు బ్యాంకు జనరల్ మేనేజర్ దయాకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జయరాములు, కుంభం వెంకట్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వీరయ్య, మల్లయ్య, రమేష్, తిరుమలేశ్వర్‌రావు, ఉభయ సంఘాల కోర్ కమిటీ సభ్యులు, ప్రాంతీయ కార్యదర్శులు సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షమయ్య గౌడ్

బాధితులకు ఊరట

● వన్య ప్రాణుల దాడిలో ధ్వంసమైన పంటలకు పరిహారం పెంపు
● అధికారుల సహకారం కోసం రైతుల ఎదురుచూపులు



గూడూరు అభయారణ్యంలో సంచరిస్తున్న అడవిపందులు(ఫైల్)

గూడూరు, జనవరి 9: వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన వారికి ఇచ్చే నష్టపరిహారాలను పెంచుతూ రాష్ట్ర అటవీశాఖ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఏజెన్సీ గ్రామాలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో వ్యవసాయక్షేత్రాలకు రైతులు వెళ్లిన సమయంలో తరుచూ వన్యప్రాణుల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే వన్యప్రాణులు వేల ఎకరాల్లో పంటలను నష్టం చేస్తున్నాయి. గతంలో నష్టపరిహారానికి ఉత్తర్వులు ఉన్నప్పటికీ కొందరికే పరిహారం మంజూరైంది. రెండేళ్లుగా పంటనష్ట పరిహారానికి సంబంధించి దరఖాస్తులను తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వన్యప్రాణుల వల్ల జరిగే నష్టానికి పరిహారం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో ఏజెన్సీ ప్రాంత సాగు రైతులకు కొంతమేర మేలు జరుగనుంది.

15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో రైతులు 15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.50 లక్ష హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. జిల్లాలోని పలు గ్రామాలు ఏజెన్సీ గ్రామాలు, అటవీప్రాంతాలకు దగ్గరగా ఉండడం ద్వారా అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ సీజన్‌లో సుమారు 19 నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జ రుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. పరిహారం పొం దడంపై అవగాహన లోపం, త్వరగా మంజూరు కాకపోవడంతో చాలామంది గిరిజన, గిరిజనేతర రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు కూడా చేసుకోవడం లేదు. రైతులు రాత్రి, పగలు కష్టపడుతున్నా వన్యప్రాణుల నుంచి పంటలను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. అడవి పందులు పంటల యొక్క వాసన పసిగట్టే గుణం కలిగి ఉంటాయి. మొక్కల ఉనికిని అవి దూరం నుంచే పసిగట్టి గుంపులు గుంపులుగా పంటక్షేత్రాల్లో చొరబడి పంటలను ధ్వంసం చేస్తుంటాయి. చేనులకు కాపలాగా ఉన్న రైతులు పందులను తరిమికొట్టే సమయంలో వాటిదాడిలో తీవ్రంగా గాయపడతారు. దీంతోపాటు ఇతర క్రూరమైన జంతువుల దాడిలో పశువులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

అంచనా వేయడంలో జాప్యం

అడవి పందుల దాడులతో జరిగిన నష్టానికి పరిహారం రావాలంటే దరఖాస్తు చేసుకున్న రైతుల పంట క్షేత్రాలను అటవీ అధికారులు సందర్శించి, నష్టం అంచనా వేయాల్సి ఉంది. అయితే సకాలంలో వారు రాకపోవడంతో పరిహారంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దరఖాస్తు సమయంలోనే రెవెన్యూ, వ్యవసాయ, అటవీశాఖ అధికారుల నివేదికలు జతచేసి పంపిస్తున్నా విచారణ పేరుతో నెలల తరబడి ఫైల్ ముందుకు కదలడం లేదు. యేటా ఎంతోమందికి పరిహారం ఇచ్చారనేది కూడా అధికారుల వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం. వన్యప్రాణుల దాడిలో మనుషులు మృతిచెందితే గతంలో రూ.5లక్షల పరిహారం ఉండగా, ప్రస్తుతం దానిని రూ.10లక్షలకు పెంచారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.75వేలు ఉంటే ప్రస్తుతం రూ.లక్ష, పంటనష్టం జరిగితే ఎకరాకు గతంలో రూ.6వేలు ఉంటే ఇప్పుడు రూ.7,500, పశువులు చనిపోతే గతంలో రూ.20 వేలు ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు పెంచారు.



సీతానగారంలో అడవి పందుల సంచారంతో ధ్వంసమైన మొక్కజొన్న పంట (ఫైల్)

పరిహార నిబంధనలు ఇవే..

అటవీ జంతువులతో ప్రమాదం జరిగినా, వ్యక్తులు మృతి చెందిన, పంటలకు నష్టం వాటిల్లినా.. సంబంధిత అటవీశాఖ నుంచి పరిహారం పొందవచ్చు. అయితే పాములు, కోతుల కారణంగా మృతి చెందినా, గాయపడ్డ పరిహారానికి అర్హత ఉండదు. కేవలం వన్యప్రాణుల దాడిలో జరిగిన నష్టానికి పరిహారం పొందవచ్చు. సంఘటనలు జరిగిన ఒకట్రెండురోజుల్లో సంబంధిత అటవీశాఖ రేంజ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారి, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పంటనష్టం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తారు. వారు విచారణ జరిపి బాధితులకు నష్టపరిహారం మంజూరు చేస్తారు. కాగా, క్షేత్రస్థాయిలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు వేర్వేరుగా వన్యప్రాణుల దాడుల్లో ధ్వంసమైన పంట క్షేత్రాలను పరిశీలిస్తున్నారు. ఇలా ఒక్కొక్క అధికారి చుట్టు రైతులు తిరగాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది.

సంక్రాంతి కీడు అంటూ..

● పల్లెల్లో ఐదు రకాల గాజుల సెంటిమెంట్
● మూఢనమ్మకాలను పట్టించుకోవద్దంటున్న విద్యావంతులు

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 9 : ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ కీడుతో వచ్చిందంట..! అందుకని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఇద్దరు కుమారులు కలిగిన తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఐదు రకాల గాజులను వేయించుకోవాలి, లేదంటే ఒక్క కొడుకుకు కీడు తప్పదు. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఓ వైపు ప్రపంచం సైన్స్ పరంగా అభివృద్ధిలో దూసుకుపోతోంటే ఈ ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి అసత్య మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగ రాబోతున్న వేళ తాజాగా ఈ ప్రచారం షికారు చేస్తోంది. ఇద్దరు కుమారులు ఉన్న తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఐదు రకాల గాజులు కొనుక్కోవాలంట..! అవి మళ్లీ ఒక కొడుకు ఉన్న వారితోనే వేయించుకోవాలంట.. ఈ వింత ప్రచారం పల్లెల నుంచి పట్టణాలకు పాకింది. మహిళలు ఈ ప్రచారాన్ని నమ్ముతూ.. గాజుల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా సైన్స్ ఉపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి చీర భిక్షపతి ఈ వింత ప్రచారాన్ని నమ్మొద్దని సూచిస్తున్నారు. ఆధునిక యుగంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దన్నారు. గతంలో సైతం సంక్రాంతి, ఉగాది పండుగల ముందు వదిన, మరదళ్ల గాజులు, అన్నదమ్ముళ్లకు కుడుకలు, ఆడబిడ్డలకు కుంకుమభరణాలు, చీరలంటూ ప్రచారాలు జరిగాయని, ఇలాంటి వాటిని ప్రతీ ఒక్కరు ఖండించాలని భిక్షపతి కోరారు.

నిట్‌లో కేర్ ఆస్పత్రి వైద్యశిబిరం

కాజీపేట, జనవరి 9: నిట్‌లో మంగళవారం హైదరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి హాజరై నిట్ సిబ్బందికి, స్టూడెంట్స్‌కు సుమారు 150 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నిట్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 9: రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రైల్వే కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని మంగళవారం రెండో రోజు రిలే దీక్షలు చేశారు. ఈ దీక్షలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రారంభించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో సైతం మోదీ ప్రభుత్వం ఆటలాడుకుం టోందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అనంతరం ఉద్యోగులకు అన్నివిధాలుగా న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొత్త మురళీ కృష్ణ, కేంద్ర కమిటీ సభ్యుడు చింతమురళి, సాధినేని వెంకటనారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా సెక్రటరీ, రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ ఛైర్మన్ పాక రాజ్‌కుమార్, అభిలాష్, ముస్తాక్ హుస్సేన్, బలివేందర్ సింగ్, లక్ష్మీనారాయణ, రాజలింగం, స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.అంకూస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు బాధ్యతలు

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇప్పటివరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నుంచి కేయూ హాస్టల్స్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, దూరవిద్య కేంద్రం పీఆర్‌ఓ డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, తదితరులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.



డైరెక్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న శ్రీధర్‌కుమార్‌లోథ్, చిలువేరు రాజ్‌కుమార్ తదితరులు

ఐటీసీ చేతికి బిల్ట్!

● పేపర్‌మిల్లు, ఆహార ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు అవకాశం ● నెలరోజులుగా కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు ● అందుబాటులో 750 ఎకరాల భూములు ● మంత్రి సీతక్క చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు



బిల్ట్ ప్రధాన గేటు

ములుగు, జనవరి 9: ఎట్టకేలకు బిల్ట్‌కు మంచిరోజులు రాబోతున్నాయి. మూడు దశాబ్దాలపాటు వెలుగు వెలిగిన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ పదేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. కార్మికులకు, పరోక్షంగా ఆధారపడ్డ వారికి ఉపాధిని దూరం చేసింది. ఆశలు అడుగంటిన క్రమంలో ఐటీసీ సంస్థ ముందుకు వచ్చింది. ఇక పునరుద్ధరణ ప్రక్రియ చకాచకా సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో పాత పేపర్ మిల్లు స్థానంలో మళ్లీ పేపర్, ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను నెలకొల్పుతారని తెలుస్తోంది.

ఐటీసీ ద్వారా బిల్ట్ పునరుద్ధరణ

పారిశ్రామిక రంగంలో ఐటీసీ సంస్థకు దేశీయంగా మంచి పేరు ఉంది. 2014లో బిల్ట్ మూతపడ్డప్పటి నుంచి ఈ సంస్థపైనే అందరి దృష్టి మరలింది. పేపర్‌తోపాటు ఆహార ఉత్పత్తుల తయారీలో ఐటీసీ విస్తరించగా బిల్ట్ పునరుద్ధరణ ఈ సంస్థతో సాధ్యమవుతుందని సర్వత్రా భావించారు. సుదీర్ఘ కాలం తర్వాత ఎట్టకేలకు ఐటీసీయే ముందుకు రావడం గమనార్హం. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) తీర్పు తర్వాత బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ కంపెనీతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు సమాచారం. ఇటీవల పలు దఫాలుగా ఐటీసీ ప్రతినిధులు కమలాపురం వచ్చి సర్వేలు కూడా చేపట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని ఇరు సంస్థల ప్రతినిధులు కలవడం, బిల్ట్‌ను నడిపించేందుకు ఐటీసీకి ప్రభుత్వం పక్షాన పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించడంతో త్వరలోనే ఫ్యాక్టరీలో సైరన్ మోగుతుందనే తెలుస్తోంది.

బిల్ట్ స్థిరాస్తి 750 ఎకరాలు

బిల్ట్ సంస్థకు కమలాపురంలో 750 ఎకరాల భూములు ఉన్నాయి. 600 ఎకరాల్లో ఫ్యాక్టరీ, 150 ఎకరాల్లో కాలనీ, ఆస్పత్రి, అతిథిగృహాలు, పాఠశాల (థాపర్ విద్యావిహార్), స్టాఫ్‌క్లబ్ నిర్మాణాలు ఉన్నాయి. ఇవన్నీ ఎం.ఎల్.థాపర్ పేరిట ఉండగా ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పు తర్వాత ఫిన్‌క్వెస్ట్ కంపెనీ ఆధీనంలోకి వెళ్లాయి. ప్రస్తుతం భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చివేసి అవసరాలకు అనుగుణంగా నూతన నిర్మాణాలు చేసుకోవచ్చు.

కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు

పదేళ్లుగా యంత్రాలు నడవకపోవడంతో తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఇటీవలికాలంలో కొన్ని దొంగిలించబడ్డాయి. చోరీలకు పాల్పడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి సామగ్రిని పట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీలోని పాత యంత్రాలను ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. నెలరోజులుగా కార్మికులు భారీ యంత్రాలను విడదీస్తుండగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఆరు నెలల కాల వ్యవధిలో పాత యంత్రాల తొలగింపు పూర్తిచేసి ఐటీసీకి అప్పగించేలా ఆసంస్థ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఉపాధికి ఊతం

బిల్ట్ ఫ్యాక్టరీ తిరిగి తెరుచుకుంటే స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఉన్నత విద్యార్హత ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక చాలా మంది పట్టణాలకు వెళ్తున్నారు. కొందరు పొరుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. బిల్ట్‌తో అలాంటి వారందరికీ ఉద్యోగాలు లభిస్తాయనే ఆశ కలుగుతోంది. పరోక్షంగా వందలాది కుటుంబాలకు ఉపాధి కలగనుంది. కర్మాగారం లేఆఫ్ ప్రకటించిన తర్వాత 670 మంది పర్మినెంట్ కార్మికులు మిగిలారు. గడిచిన పదేళ్లలో 58 మంది వివిధ కారణాలతో మరణించారు. 37మంది ఉద్యోగ విరమణ పొందారు. ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలతో ఇటీవల వీరి కుటుంబాలకు గ్రాట్యుటీ కింద వారివారి సర్వీసును బట్టి కొంత మొత్తాన్ని చెల్లించారు. 2020 వరకు సర్వీసును పరిగణలోకి తీసుకోవాల్సి ఉండగా 2015 డిసెంబరు కాలానికే ఇచ్చారని కార్మికులు చెబుతున్నారు. చట్ట ప్రకారం పూర్తి మొత్తంతోపాటు పెండింగ్ వేతనాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కార్మిక కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు అర్హతను బట్టి ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీతక్క కృషిపై సర్వత్రా హర్షం

ములుగు ఎమ్మెల్యే సీతక్క రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే బిల్ట్ ఫ్యాక్టరీపై సీఎం స్థాయిలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫ్యాక్టరీని తెరిపించే విషయంలో 2014 నుంచి సీతక్క పోరాడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో గత ప్రభుత్వంపై అనేక పర్యాయాలు ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యంగా బిల్ట్ అంశాన్ని తీసుకుంటానని, ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు ఐటీసీ సంస్థను ఒ ప్పించి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహకారానికి భరోసా ఇప్పించారు. ఆ సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం, పాత యంత్రాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుండటం, ఏళ్లకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల గ్రా ట్యుయటీ సెటిల్ కావడం వంటి అనుకూల పరిణామాలు చకాచకా చోటుచేసుకోవడంతో బిల్ట్‌కు మంచిరోజులు వస్తాయనే ఆశకు మరింత బలాన్నిస్తున్నాయి.



జామపండుపై సాయిబాబా వెలిసాడంటూ..

గిర్మాజిపేటలో జనం పూజలు

గిర్మాజిపేట, జనవరి9 : నగరంలోని ఒక వృద్ధ దంపతుల ఇంట్లో పసుపురంగు జామపండుపై సాయిబాబా వెలిసాడని జరిగిన ప్రచారంతో పలువురు తరలివచ్చి పూజలు జరిపారు. ఈ సంఘటన మంగళవారం గిర్మాజిపేటలో జరిగింది. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న కీర్తినారాయణ, సోమలక్ష్మి దంపతులు గత శుక్రవారం ఇంట్లో దేవుడి పటాలతో ఉన్న సాయిబాబా విగ్రహానికి పూజలు చేశారు. ఇంట్లో ఉన్న జామపండును సాయిబాబా విగ్రహం వద్ద పెట్టి మొక్కుకున్నారు. మంగళవారం మనుమరాలుకు ఇచ్చేందుకు సోమలక్ష్మి పండును తీసుకువచ్చి ఇంటి ముందున్న బకెట్ నీటిలో కడిగేందుకు ప్రయత్నించింది. అయితే జామపండుపై సాయిబాబాను పోలిన రూపం కనిపించడంతో దానిని తిరిగి సాయిబాబా విగ్రహం ముందు పెట్టింది. పసుపురంగు జామపండుపై సాయిబాబా వెలిసాడనే ప్రచారంతో స్థానిక ప్రజలు సోమలక్ష్మి ఇంటికి వచ్చి జామపండుపై సాయిబాబాను దర్శించుకుని సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.

ఒక్క కొడుకు ఉన్నోళ్లుకు కీడంటూ పుకార్లు

గాజులు వేయించుకుంటే దోషం పోతుందని ప్రచారం



శంభునిపేట, జనవరి 9: ఒక్క కొడుకు ఉన్నోళ్లకు సంక్రాంతి కీడంటూవారం రోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఒక్క కొడుకు ఉన్న తల్లులు ఇద్దరు, అంతకంటే ఎక్కువ కొడుకులు ఉన్న తల్లులతో గాజులు వేయించుకుంటే దోషం పోతుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. దీంతో ఆందోళన చెందుతున్న తల్లులు గాజులు వేయించుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా స్థానికంగా బంధువులు ఉంటే నేరుగా... లేదంటే స్థాయిని బట్టి డబ్బులు పంపిస్తూ ఒక్క కొడుకున్న తల్లులు వేయించుకుంటున్నారు.

నమ్మొద్దంటున్న పురోహితులు..

గాజులు వేస్తే కీడు పోతుందనేది తప్పుడు ప్రచారమని, వీటిని ఎవరూ నమ్మొద్దని పురోహితులు పేర్కొంటున్నారు. పండుగలు సంప్రదాయంగా ప్రజలంతా సంతోషంగా జరుపుకోవటానికే వస్తాయని, వాటికి కీడు ఆపాదించడం సబబు కాదంటున్నారు. శాస్త్రంలో ఎక్కడా కీడు అని గాజులు కొనివ్వాలని లేదంటున్నారు. మరోవైపు సైన్స్ అభివృద్ధి చెందుతుంటే ఇలాంటి ప్రచారాలు జరగడం విడ్డూరంగా ఉందని, ఇవేవీ ప్రజలు నమ్మవద్దని మేధావులు పేర్కొంటున్నారు.

ఇదిలా ఉంటే.. గాజులు వేయాలనే ప్రచారం ఊపందుకోవటంతో వారం రోజుల నుంచి లేడీస్ ఎంపోరియాల్లో గాజుల దందా జోరందుకుంది. బస్సుల్లో ఉచిత ప్రయాణం అని కొందరు మహిళలు గాజులు కొనుక్కోవటానికి గ్రామాల నుంచి నగరానికి వస్తున్నారు. బంధువుల ఇళ్లకి వెళ్లి గాజులు వేయించుకుని వస్తున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు





హనుమాన్ వీధిలో, రంగశాయిపేట వాటర్ ట్యాంకు వద్ద జాతీయ రహదారి పై ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

శంభునిపేట, జనవరి 9 : నగరంలో పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగామారాయి. రోడ్డు పక్కనే ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. రంగశాయిపేట వాటర్ ట్యాంకు వద్ద జాతీయ రహదారి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏళ్లుగా మార్చటం లేదు. వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పక్కనే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను గతంలో ఓ ఆటో, ఇద్దరు ద్విచక్ర వాహనదారులు, ఓ కారు ఢీ కొట్టింది. డ్రైవర్‌లు అప్రమతంగా వ్యవహరించటంతో ప్రమాదాలు తప్పాయి. లేదంటే ప్రాణాలు గాల్లో కలిసిపోయేవే. ప్రమాదకరంగాఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే, శంభునిపేట జంక్షన్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించపోవటంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం కలుగుతోంది. జంక్షన్ అభివృద్ధికి ఈ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంకిగామారినా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. రంగశాయిపేట హనుమాన్ ఆలయం వద్ద డ్రైనేజీలోనే విద్యుత్ స్తంభంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మించారు. వీధి క్రాస్‌లో ఏళ్లుగా ప్రమాదకరంగా ఉంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం వల్ల డ్రైనేజీ నీరు పారక ఈ ప్రాంతం మురికి నీరు రోడ్డు పైకి వచ్చి కంపు కొడుతోందని వాపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మొక్కల తీగలు అల్లుకుంటున్నాయి. స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం అన్ని ప్రాంతాల్లో 8 ఫీట్ల పిల్లర్ల పై ఆధునిక ట్రాన్స్‌ఫార్మర్‌లను బిగించారు. కానీ, ట్రాన్స్‌ఫార్మర్‌లతోపాటు ప్రాంతంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇప్పటి వరకు మార్చలేదు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే 8ఫీట్ల ఎత్తున పిల్లర్‌ను నిర్మించి త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్చాలని స్థానికులు సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిపై కేసు

ఖానాపురం, జనవరి 9: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొంగు మాధవ్‌గౌడ్ మంగళవారం తెలిపారు. అశోక్‌నగర్ గ్రామానికి చెందిన ఆకారపు శ్రవణ్(24) ఓ గ్రామానికి చెందిన యువతిని(20) ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని ఆదివారం దాడికి పాల్పడగా, గాయాలపాలైన యువతి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు శ్రవణ్‌పై కేసు నమోదు చేసి మంగళవారం అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఇక ముందు ఇలాంటి నేరాలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

సంబరాల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్నట్రస్టు ప్రతినిధులు

పోచమ్మమైదాన్, జనవరి 9: సంక్రాంతి పండగను పురస్కరించుకొని 14న సప్తధామ్‌లో సంబరాలు నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. పైడిపెల్లిలోని గురుధామంలో (సప్తధామ్) మంగళవారం ట్రస్టు ఆధ్వర్యంలో సంబరాల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. బోగి మంటలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. అలాగే సంబరాల పోటీలలో ఉత్తమ మహిళలను ఎంపిక చేసి బహుమతులు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరాలి వచ్చి సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

వివరాలకు 98484 23133 నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయినారాయణ, గండె ఉమాశంకర్, రేపాల రామ చందర్, లాయక్ అహ్మద్, పబ్బతి నరేష్, రేపాల ఆనందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర ప్రకటించాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్



మార్కెట్లో మిర్చిని పరిశీలిస్తున్నరైతు సంఘం నాయకులు

వరంగల్‌టౌన్, జనవరి 9: ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన మిర్చికి మార్కెట్లో గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఏనుమాముల మార్కెట్‌ను సందర్శించింది. రైతులను కలిసి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. మార్కెట్లో మిర్చి రైతులకు అన్యాయం జరుగుతోందని, వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గోనె కుమారస్వామి, ఎండి. ఇస్మాయిల్, కుసుంబ బాబూరావు పాల్గొన్నారు.



రోడ్లు ఊడుస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు

విద్యార్థుల స్వచ్ఛత సేవలు

మామునూరు, జనవరి 9 : మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ విద్యార్థులు స్వచ్ఛత సేవలు నిర్వహించారు. 44వ డివిజన్ సింగారంలో రోడ్డును శుభ్రం చేశారు. ప్రకృతి వ్యవసాయం, అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై సమాచార కేంద్రాలు పెట్టి రైతులకు నేర్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్‌జ్యోతి, సౌమ్య, సాయికిరణ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

11 నుంచి క్రికెట్ పోటీలు

గీసుగొండ, జనవరి 9: నేతాజీ జయంతి సందర్భంగా మొగి లిచర్లలో అల్లం బాలకిశోర్‌రెడ్డి(ఏబీకేఆర్) యువసేన ఆధ్వర్యంలో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ సెష న్-2 ఈనెల 11 నుంచి నిర్వహించనున్నట్లు నేతాజీ సర్వీస్ టీం ప్రతినిధి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 77029 16607 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేరుశనగ పంట పరిశీలన



క్షేత్ర పరిశీలన చేస్తున్న వ్యవసాయాధికారి ఉషాదయాల్

సంగెం, జనవరి 9: జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులు సాగు చేసిన రాంచంద్రాపురంలోని వేరుశనగ పంటను జిల్లా వ్యవసాయాధికారిని ఉషాదయాల్ మంగళవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టి పెట్టుకొని సబ్సిడీపై వ్యవసాయ పరికరాలతోపాటు విత్తన గింజలను అందించి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ఆకు ముడత, పొగాకు లద్దెపురుగు నివారణ కోసం రైతులు ప్రత్యేక దృష్టి పెట్టి అధికారుల సలహాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ సారంగం, గవిచర్ల వ్యవసాయ విస్తీర్ణాధికారి సాగర్, రైతులు పాల్గొన్నారు.

'వేం'ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



వరంగల్‌టౌన్, జనవరి 9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో వరంగల్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే దొనెపూడి రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో టీడీపీ నుం చి ఇద్దరు ఎమ్మెల్యేలుగా పనిచేశారు.

వీర్‌గాథ 3.0 విజేతకు సన్మానం



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, జనవరి 9: రెండు నెలల క్రితం నిర్వహించిన వీర్‌గాథ 3.0 పోటీలో ఉప్పరపెల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని కాసాని కీర్తిప్రసన్న జాతీయ స్థాయి విన్నర్‌గా నిలిచిందని హెచ్‌ఎం జయ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అభినందనలు తెలియజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధులు, గ్యాలెంటరీ అవార్డు విజేతల స్మరణలోకి తెచ్చుకోవడం కోసం 3వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలను వీర్ గాథ 3.0 పేరుతో నిర్వహించినట్లు పేర్కొన్నారు. కోటి మందిలో 100 మందిని ఎంపిక చేయగా కీర్తిప్రసన్న ఎంపికైందన్నారు. జనవరి చివరి వారంలో న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ, రక్షణ శాఖ మంత్రుల చేత సన్మానం, రూ.10వేల నగదును అందుకోనుందన్నారు. కార్యక్రమంలో పిన్నింటి బాలాజీరావు, ఆమంచ రవికుమార్, సునిత, శశిధర్, సంతోష్‌కుమార్, వేముల మమత, ఉదయ్‌కుమార్, మురళికృష్ణ, మోహన్‌రావు, రవీందర్, ఇందిర పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు



ఊరేగింపుగా అక్షింతలను తీసుకువెళుతున్న భక్తులు

వరంగల్‌టౌన్, జనవరి 9: అయోధ్య రామాలయానికి సంబంధించిన అక్షింతలను కాశిబుగ్గలోని శివాలయం నుంచి మంగళవారం ఏనుమాముల సుందరయ్యనగర్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయానికి భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. సుందరయ్యనగర్ వాసులు మంగళహారుతులు పట్టి ఊరేగింపునకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భక్తాంజనేయస్వామి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు



గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులతో సర్పంచ్

గీసుగొండ, జనవరి 9: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని వరంగల్ రుషి హైస్కూల్ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 6వ తరగతి సాంఘికశాస్త్రంలో గంగదేవిపల్లి అభివృద్ధి గురించి పాఠ్యాంశంగా ఉన్న నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచార్య, ప్రసన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వరంగల్ ఎంఈవో విజయ్‌కుమార్

మట్టెవాడ, జనవరి 9: వరంగల్ మట్టెవాడలోని ఎంఈవో కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన న్యూ ఇయర్ క్యాలెండర్, డైరీని వరంగల్ ఎంఈవో విజయ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. సుజిన్‌ప్రసాద్, వరంగల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవీందర్, కె. రమేష్, ఖిలావరంగల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వేణుమాధవ్, నర్సింహరావు, బి.మహేష్, రామరాజు, పి.శాంతి, మహ్మద్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



ఎల్లయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రకాష్

మామునూరు, జనవరి 9: ఇటీవల తిమ్మాపురంలో మృతి చెందిన ఇల్లందుల ఎల్లయ్య మృతిచెందగా మంగళ వారం తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ గుండా ప్రకాష్ పరామర్శించారు. ఎల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు మేకల యాదగిరి, మేకల సూరయ్య, నాయకులు రావుల బాలరాజు, నరేందర్,పోశాల సదానందం, రాములు, చెక్క యాదగిరి, మవల జీవంతరెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి తహసీల్దార్ పరామర్శ

పోచమ్మమైదాన్, జనవరి 9: ఇటీవల మృతి చెందిన ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగి సదానందం కుటుంబ సభ్యులను మంగళవారం రెవెన్యూఉద్యోగులు పరామర్శించారు. తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్, వరంగల్ తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో సదానందం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ మెంబరు, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జలపతిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

పది జోన్లుగా మేడారం

5వ పేజీ తరువాయి

అవకాశ ముందని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపర్చాలని తెలిపారు. ఈసారి 6 వేల బస్సులను నడిపించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతర నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులను గుర్తించాలని, వారు రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఉన్నా ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. గత జాతరలలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతరను ప్లాస్టిక్‌రహితంగా జరిపించాలన్నారు. రోడ్ల మరమ్మతులను సత్వరమే పూర్తిచేయాలని, ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతరలో తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆదివాసీ సంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తూ జాతర జరిపించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మహాజాతర విశిష్టతపై డాక్యుమెంటరీని రూపొందించాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. 400 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. ఈ సమీక్షలో ములుగు, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ప్రావీణ్య, ఎస్పీ శబరీశ్, ఇటీవల ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎస్పీ గాష్ ఆలం, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు డీఎస్పీ రవీందర్, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్, ఐటీడీఏ ఈఈ హేమలత, డీపీవో వెంకయ్య, డీపీఆర్‌వో రఫీక్ పాల్గొన్నారు.

యాసంగి వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ధర్మసాగర్‌లో మండల కేంద్రంలో క్షేత్ర స్థాయిలో రైతులతో శాస్త్రవేత్తలు

వరంగల్ సిటీ, జనవరి 9: యాసంగిలో వరి సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానంలోని ఏరు వాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.విశ్వతేజ, డాక్టర్ బి. దిలీప్‌కుమార్, డాక్టర్ నాగభూషణం అన్నారు. హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు మండ లాల్లోని పలు వరి నారు క్షేత్రాలను పరిశీలించి రైతు లకు సలహాలు, సూచనలు అందజేశారు. వారు మా ట్లాడుతూ వానాకాలం వివిధ కారణాలతో పంట కోత ఆలస్యం కావడంతో యాసంగిలో ఆలస్యంగా నాట్లు వేసుకుంటున్న రైతులకు క్షేత్ర స్థాయిలో మంగళవారం పలు సూచనలు చేశారు. ఇంకా నాట్లు వేసుకోని వారు స్వల్పకాలిక రకాలను సాగు చేయాలన్నారు. డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలో విత్తుకోవడం మంచిదన్నారు. నేరుగా విత్తుకోవడానికి ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతా యన్నారు. లీటరు నీటికి 1గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి కొద్దిగా ముక్కు పగిలిన దశలో డ్రమ్ సీడర్ ద్వారా గానీ, నేరుగా వెదజల్లుకోవాలన్నారు.



వరంగల్ రూరల్

జామపండుపై సాయిబాబా వెలిసాడంటూ..

గిర్మాజీపేటలో జనం పూజలు

గిర్మాజీపేట, జనవరి9 : నగరంలోని ఒక వృద్ధ దంపతుల ఇంట్లో పసుపురంగు జామపండుపై సాయిబాబా వెలిసాడని జరిగిన ప్రచారంతో పలువురు తరలివచ్చి పూజలు జరిపారు. ఈ సంఘటన మంగళవారం గిర్మాజీపేటలో జరిగింది. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న కీర్తినారాయణ, సోమలక్ష్మి దంపతులు గత శుక్రవారం ఇంట్లో దేవుడి పటాలతో ఉన్న సాయిబాబా విగ్రహానికి పూజలు చేశారు. ఇంట్లో ఉన్న జామపండును సాయిబాబా విగ్రహం వద్ద పెట్టి మొక్కుకున్నారు. మంగళవారం మనుమరాలుకు ఇచ్చేందుకు సోమలక్ష్మి పండును తీసుకువచ్చి ఇంటి ముందున్న బకెట్ నీటిలో కడిగేందుకు ప్రయత్నించింది. అయితే జామపండుపై సాయిబాబాను పోలిన రూపం కనిపించడంతో దానిని తిరిగి సాయిబాబా విగ్రహం ముందు పెట్టింది. పసుపురంగు జామపండుపై సాయిబాబా వెలిసాడనే ప్రచారంతో స్థానిక ప్రజలు సోమలక్ష్మి ఇంటికి వచ్చి జామపండుపై సాయిబాబాను దర్శించుకుని సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.

పది జోన్లుగా మేడారం

(5వ పేజీ తరువాయి)

అవకాశ ముందని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపర్చాలని తెలిపారు. ఈసారి 6 వేల బస్సులను నడిపించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతర నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులను గుర్తించాలని, వారు రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఉన్నా ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. గత జాతరలలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతరను ప్లాస్టిక్ రహితంగా జరిపించాలన్నారు. రోడ్ల మరమ్మతులను సత్వరమే పూర్తిచేయాలని, ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతరలో తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆదివాసీ సంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తూ జాతర జరిపించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మహాజాతర విశిష్టతపై డాక్యుమెంటరీని రూపొందించాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. 400 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. ఈ సమీక్షలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఇటీవల ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎస్పీ గౌష్ఆలం, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు డీఎస్పీ రవీందర్, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్, ఐటీడీఏ ఈఈ హేమలత, డీపీవో వెంకయ్య, డీపీఆర్‌వో రఫీక్ పాల్గొన్నారు.

రైతులకు చేరువగా రైతు వేదికలు

దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్పు

చర్యలు చేపట్టనున్న కాంగ్రెస్ ప్రభుత్వం



వర్ధన్నపేట, జనవరి 9 : రైతులకు సలహాలు, సూచనలు అందిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. సరైన పరిజ్ఞానం లేక వ్యాపారులు సూచించిన మేర పాటిస్తూ నష్టపోతుంటారు. మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయాధికారులను కలిసేందుకు వెళ్లడం కష్టంగా ఉండేది. దీనిని దృష్టిలో పెట్టుకొని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించింది. వాటిలో ఏఈవోలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని మరింత పటిష్ఠం చేసే దిశగా చర్యలకు పూనుకుంది. ప్రతీ ఏడీఏ పరిధిలో ఒక వేదికను దృశ్య శ్రవణ కేంద్రంగా మార్చేందుకు నిర్ణయించింది. రైతు వేదికలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసినా, వారు సైతం పనులు మానేశారు. వరంగల్ జిల్లాలో సుమారు 59 వరకు రైతు వేదికలు ఉండగా నిధులు విడుదల కాకపోవడంతో ఇప్పుడు అవి అలంకార ప్రాయంగానే మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికలను దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్పు చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 3.70లక్షల చొప్పున మంజూరు

రైతు వేదికలను దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారుల నుంచి ప్రతిపాదనలను తీసుకుంటోంది. రైతులకు అందుబాటులో ఉండేలా అనువైన వాటిని ఎంపిక చేసి వాటికి ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉండేలా ఏర్పాట్లు చేయనుంది. ఇలా ఎంపిక చేసిన రైతు వేదికలకు రూ.3 లక్షల 70వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం అన్ని రైతు వేదికల్లో ఏఈవోల ఆధ్వర్యంలో వారంలో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక ముందు నిపుణుల ఆధ్వర్యంలో దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

సందేహాల నివృత్తికి కార్యచరణ

రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించేందుకు వీలుగా గ్రామాల్లో 2021లో ప్రభుత్వం క్లస్టర్ స్థాయిలో రైతు వేదికల నిర్మాణ పనులను చేపట్టింది. అడపాదడపా అక్కడ సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు అలంకార ప్రాయంగానే మిగిలిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీజన్ల సమయంలో తప్ప వీటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఇప్పుడు పంటల సాగు విధానం, తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు నేరుగా తెలియజేసేలా కార్యాచరణ రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రైతు భరోసా, పంట రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయడంతోపాటు సమస్యలకు పరిష్కారం త్వరగా చూపేందుకు అవకాశం ఉంటుంది. రైతులు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఎంత మోతాదులో వేయాలనే తదితర విషయాలపై సూచనలు అందిస్తారు.

జాతీయ స్థాయి విన్నర్‌గా ఉప్పరపల్లి విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, జనవరి 9: మండలంలోని ఉప్పరపెల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీల్లో విన్నర్‌గా నిలిచిందని పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు జయ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థిని కీర్తిప్రసన్నకు మంగళవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం వీర్ గాథ 3.0 (భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీర యోధులు, గ్యాలెంటరీ అవార్డు విజేతల స్మరణలోకి తెచ్చుకోవడం కోసం 3వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలను నిర్వహించింది) ఈ కార్యక్రమంలో భాగంగా కోటి మందిలో 100 మందిని ఎంపిక చేయగా ఉప్పరపెల్లి హైస్కూల్ నుంచి కాసాని కీర్తిప్రసన్న ఎంపికైందన్నారు. అనంతరం జనవరి చివరి వారంలో న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర విద్యా శాఖ, రక్షణ శాఖ మంత్రుల చేత సన్మానంతో పాలు 10 వేల నగదును బహుమానంగా అందుకోనుందన్నారు. కార్యక్రమంలో పిన్నింటి బాలాజీరావు, ఆమంచ రవికుమార్, సునిత, శశిధర్, సంతోష్‌కుమార్, వేముల మమత, ఉదయ్‌కుమార్, మురళికృష్ణ, మోహన్‌రావు, రవీందర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి నగదుతోపాటు తులం బంగారం

- ఈనెల 9 తర్వాత వివాహం చేసుకునే వారికి 'కల్యాణ లక్ష్మి' కింద పంపిణీ..
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నెక్కొండలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, జనవరి 9 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 9 నుంచి పెళ్లి చేసుకునే నిరుపేద ఆడపిల్లకు రూ.లక్ష 116తోపాటు తులం బంగారం ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని సిటిజన్స్‌క్లబ్‌లో మంగళవారం నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన సుమా రు 200 మందికి మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ శివ ప్రసాద్, కౌన్సిలర్లు వేములసాంబయ్యగౌడ్, బత్తినిరాజేందర్, సర్పంచ్ పార్వతమ్మతోపాటు ఆరుమండలాల తహసీల్దార్లు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మహిళల అభివృద్ధి సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని దొంతి మాధవరెడ్డి అన్నారు. నెక్కొండలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను 85 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, నర్సంపేట టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, తహసీల్దా ంట్ రాజ్‌కుమార్, అమీన్‌పేట గ్రామ సర్పంచ్ హన్మంతరావు, వార్డు సభ్యులు ఈదు నూరి దిలీప్, బాను, సాయికృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలసిన యూత్ సభ్యులు

దుగ్గొండి : మండలంలోని జిడికల్ గ్రామ త్రిశుల్ సేనా యూత్ సభ్యులు నర్సంపేటలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పోతుగంటి మహేశ్, బాస సన్నీకుమార్, సాయికుమార్, రాజేందర్, గాండ్ల పృథ్వి, ప్రతీష్, పవన్, చెల్పూ రి నర్సింహాస్వామి, సాయికిరణ్, ఉన్నారు.

ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఓలిగె నర్సింగరావులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొట్టె శ్రీనివాస్

మహిళలు జీవనోపాధిని పెంపొందించుకోవాలి

వర్ధన్నపేట, జనవరి 9:మహిళలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి జీవనోపాధిని పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ- సెర్ప్ ఏపీడీ గొట్టె శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పేదరిక నిర్మూలన సంస్థ మండల కార్యాలయంలో వివిధ గ్రామాల సమైక్య సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామ ఐక్య సంఘాల ద్వారా అందించే సామాజిక పెట్టుబడి నిధులతో మహిళలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను నెలకొల్పి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఏపీఎస్ వీర్ల వేణు, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, పెండ్లి సంపత్, స్వామి, సునిల్, రజిత, శ్రావణి, పల్లవి, సునీత, రేవతి, ఎమ్డీ బాను, మౌనిక, లక్ష్మీ, అనిత, జ్యోతి, పూషమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారులపై ఫిర్యాదు



ఉన్నతాధికారికి ఫిర్యాదు చేస్తున్న మంజులారెడ్డి

వర్ధన్నపేట రూరల్, జనవరి 9 : మండలంలో పనిచేస్తున్న పశువైద్యాధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వీరి నిర్లక్ష్యం కారణంగా మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆరోపిస్తూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా పశువైద్యాధికారి బాలకృష్ణలకు మంగళవారం రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు మంజులారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మండలంలోని కట్ర్యాలలో పశువైద్యాధికారుల నిర్లక్ష్యంతో లేగదూడ చనిపోవడం జరిగిందన్నారు. సకాలంలో వైద్యం అదించకపోవడం, రైతులు పశువులను తీసుకువస్తే మా పరిధి కాదని చెప్పడం పరిపాటిగా మారిందని ఆరోపించారు.

ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

ఖానాపురం, జనవరి 9: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొంగు మాధవ్‌గౌడ్ మంగళవారం తెలిపారు. అశోక్‌నగర్ గ్రామానికి చెందిన ఆకారపు శ్రవణ్(24) అనే వ్యక్తి ఓ యువతిని ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తూ, ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని ఆదివారం దాడికి పాల్పడగా, గాయాలపాలైన యువతి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు శ్రవణ్‌పై కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇక ముందు ఇలాంటి నేరాలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వర్ధన్నపేట, జనవరి 9: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం వర్ధన్నపేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఓర్సు రాంచంద్రు (65)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం చిన్న భార్యపై హత్యాయత్నం చేశాడన్న ఫిర్యాదుపై రాంచంద్రు జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై విడుదల అయిన అనంతరం మూడు రోజుల క్రితం పట్టణంలోని చిన్న భార్య వద్దకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన భార్య, కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

వివాహిత మృతి

నెక్కొండ, జనవరి 9 : నెక్కొండ బీసీ కాలనీకి చెందిన వివాహిత సుంకరి వీణ మాధురి (34) ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై షెక్ జాన్‌పాషా తెలిపారు. బీసీ కాలనికి చెందిన వ్యాన్ డ్రైవర్ సుంకరి నరేష్‌తో వీణమాధురికి 16 సంవత్సరాల క్రితం ప్రేవ వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు సంవత్సరాల నుంచి భార్య వీణమాధురిని అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులను భరించలేక గత నెల 30న గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. పక్కింటి వారు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి సోదరుడు మూడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరంగల్ సిటీ, జనవరి 9: యాసంగిలో వరి సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానంలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.విశ్వతేజ, డాక్టర్ బి. దిలీప్‌కుమార్, డాక్టర్ నాగభూషణం అన్నారు. హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని పలు వరి నారు క్షేత్రాలను పరిశీలించి రైతు లకు సలహాలు, సూచనలు అందజేశారు. వారు మాట్లాడుతూ వానాకాలం వివిధ కారణాలతో పంట కోత ఆలస్యం కావడంతో యాసంగిలో ఆలస్యంగా నాట్లు వేసుకుంటున్న రైతులకు క్షేత్ర స్థాయిలో మంగళవారం పలు సూచనలు చేశారు. ఇంకా నాట్లు వేసుకోని వారు స్వల్పకాలిక రకాలను సాగు చేయాలన్నారు. డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలో విత్తుకోవడం మంచిదన్నారు. నేరుగా విత్తుకోవడానికి ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. లీటరు నీటికి 1గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి కొద్దిగా ముక్కు పగిలిన దశలో డ్రమ్ సీడర్ ద్వారా గానీ, నేరుగా వెద జల్లుకోవాలన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి



నర్సంపేటలో డీటీ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

నర్సంపేట, జనవరి 9 : దళితుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయకుండా గ్రౌండింగ్ పనులను పూర్తి చేసి ఆర్థిక సహాయం అందించి దళితులను ఆదుకోవాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితబంధుపథకం లబ్ధిదారులు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ రాజ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నర్సంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళితబంధు లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ద్వారా ప్రొసీడింగ్ కాపీలను అందించగా వాటికి సంబంధించి బ్యాంకు ఖాతాలు తెరిచామన్నారు. ఎన్నిల కోడ్ అమలు కావడంతో ఆర్థిక సహాయం అందలేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని రద్దుచేసిందని తెలిసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల కోసం అందిస్తున్న రూ.12లక్షల పథకానికి తమను అర్హులుగా గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో కొంకటి రవీందర్, మామిడాల మధు, యాతంగి నరేశ్, యల్లయ్య స్వామి, జమాండ్ల చంద్రమౌళి, సాంబయ్య, బందెల రాజమౌళి, కిషోర్ పాల్గొన్నారు.

● ఖానాపురం: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దళిత బంధు పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు నిధులను విడుదల చేయాలని లబ్ధిదారులు ఎంపీడీవో సుమనవాణి, తహసీల్దార్ కిరణ్‌కుమార్‌లకు వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అశోక్‌నగర్ సర్పంచ్ గొర్రె కవితరవి, బీఆర్ఎస్ పార్టీ సోషల్‌మీడియ మండల కన్వీనర్ దాసరి రమేష్, దళిత బంధు లబ్ధిదారులు నేలమర్రి నాగరాజు, జన్ను సురేష్, కొంరమ్మ, వెంకన్న, వనజ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయాలని మండల దళిత బంధు లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు దళిత బంధు లబ్ధిదారులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నమిండ్ల సురేష్, సాధు నర్సింగరావు, మంద జనార్ధన్, మదాసి కుమారస్వామి, నర్మెట సాంబయ్య, పసునూరి యాకుబ్,తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై

చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట, జనవరి 9 : పట్టణంలోని మహబూబాబాద్‌రోడ్‌లోని 121 సర్వేనంబర్ లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ గద్దవెంకటేశ్వర్లు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2010, 2011 సంవత్సరంలో ఇండ్లులేని పేదలు గుడిసెలు వేసుకొని స్థలాలు కేటాయించాలని అప్పటి కలెక్టర్ వాకాటి కరుణకు వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. గుడిసెలను పోలీసులు తొలగించారని తెలిపారు. అప్పటికలెక్టర్ కరుణ ఆదేశాల మేరకు పోలీసులతో కలిసిఅప్పటి తహసీల్దార్ ప్రభుత్వభూమిగా హద్దులు ఏర్పాటు చేశారన్నారు. 121 సర్వేసంబర్‌లోని 20 గుంటలస్థలంలో గత ఆగస్టు 16న అంబేద్కర్ భవననిర్మాణానికి టెండర్ వేయడం జరిగిందన్నారు. ఇట్టి ప్రభుత్వ స్థలంలో మొరంపోసి ఆక్రమించడానికి యత్నిస్తున్న రియాల్టర్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ కోకన్వీనర్ తడుగుల విజయ్‌కుమార్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధూ, సర్పంచుల ఫోరం నర్సంపేట అధ్యక్షుడు కొడారి రవి, కుమార్, శ్రీకాంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లబెల్లి, జనవరి 9: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో టీస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను మంగళవారం మండల యూటీఎఫ్ బాధ్యులు ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. అనంతరం మండల ఎంఈవో చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఉపాధ్యాయులు విద్యార్థులకు నిరంతర విద్యాతో పాటు సామాజిక అంశాలపై విస్తృతంగా బోధించాలన్నారు. అలాగే సమాజంలో నూతన టెక్నాలజీ మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులకు, ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు.

అనంతరం ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల్లో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలాగే పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ రావుఫ్, ఎండీ రాయబోస్, నాంపల్లి రాజయ్య, కత్తి కుమారస్వామి, బుచ్చన్న, మోహన్, లాల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



ఖానాపురంలో డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపురం, జనవరి 9: డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య మాట్లాడుతూ ప్రభుత్వము ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆరిఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు కొర్ర రమేష్, మాలోతు జగన్, వాసం శ్రీనివాస్, డేనియల్‌పాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మండలంలోని ఏనుగల్లులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, నోడల్‌ఆఫీసర్ గాయపు లింగారెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి, మండల అధ్యక్షుడు మిట్టపెల్లి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి కందగట్ల రమేష్, ఎల్లరాజు, కిషన్, శ్రీధర్, కుమారస్వామి, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో యూ టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్, మండల అధ్యక్షుడు పాక శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి గుండు కరుణాకర్, ఏనుగల్లు కాంప్లెక్స్ హెచ్ఎం హైమావతి, సంఘం బాధ్యులు ప్రసాద్, శివప్రసాద్, సంపత్, మనోహర్, నరేందర్, కిషన్, మల్లికార్జున్, రుద్రమరాణి, జయ, కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.